# మామ్మగారూ! మీకు మళ్ళీ పెళ్ళయిందా?

సిహెచ్. జె. సత్యానంద కుమార్.

ఆ దినం ఫస్టు తారీఖు ఆఫీసు జీతాలు వేయి కళ్ళతో ఎదురుచూసే రోజు. పెన్షను పత్రాలు కూడా వేయి ఆశలతో ఎదురుచూసే రోజు.

పెన్షను ఇచ్చే ఆఫీసు వరండాలో వయసు ఉడిగిన పెన్షనర్లు మెత్తబడిపోయిన అప్పడాలలా డీలాపడి బెంచీలపైన, నేలమీద కూర్చున్నారు. వయసు మళ్ళబోతున్న మరికొందరు వాడిపోయిన తోటకూర కాడల్లా నీరసంగా నిల్చున్నారు. వాళ్ళ కడుపులలో ఆకలి కరాళనృత్యం చేస్తుంటే, ముఖాలపై అసహనం కాంగరే డాన్సు చేస్తూంది.

కిటకిటాల తలుపులు మూసుకొని కూర్చొని పనులు చేసుకుంటున్న ఉద్యోగులను- పిచ్చాసుపత్రిలో ఊచల వెనుకనున్న పిచ్చివాళ్ళను చూస్తున్నట్లు నిల్చున్నారు మరికొందరు పెన్షనర్లు

మహెంజదారో హరప్పా నాగరికతా కాలానికి చెందినట్లున్న టేబులు వెనుక పాతకుర్చీలో కూర్చొని నోట్లను లెక్క పెడుతున్న కాషియరు జైల్లోనే దొంగనోట్లు తయారుచేస్తున్న కోయంబత్తూరు కేడీలా ఉన్నాడు. చుట్టూ ఎత్తయిన కిటకటాలలో ఉన్న గదిలో కూర్చున్న ఆఫీసరు ఎరీనాలో కూర్చున్న పడుచు ఎలుగుబంటిలా ఉన్నాడు.

"సమయం రెండు కావస్తోంది. ఉదయం పది గంటలనుంచి పడిగాపులు కాస్తున్నా పెన్షను మాత్రం ఇచ్చే సూచనలు కనిపించడం లేదు. ఇంతమంది స్టాఫూ ఏం చేస్తున్నారో మరి" ఓ ముసలాయన నీరసంగా నిట్టూర్చి, సణిగాడు.

ఆకాశంలోని సూర్యుడు నేలమీద నిప్పులు కురిపిస్తున్నాడు కూలిపోడానికి సిద్ధంగా ఉన్న ట్రెజరీ ఆఫీసు ప్రహరీ గోడ దగ్గర పడి వున్న అరటిపళ్ళ తొక్కల్ని, ఎండిపోయిన ఓ ఆవు గోడ పక్కనున్న కిల్లీ బడ్డీ దగ్గర సోడాకాయలు తాపీగా అమ్ముడుపోతున్నాయి

ఆ ట్రెజరీ ఆఫీసర్ని - ఆఫీసులోని గుమాస్తాలను, బంట్రోతులను వాళ్ళ పెళ్ళాం పిల్లల్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా తిట్టుకుంటూ కూర్చున్నారు పెన్షనర్లు. కొందరు సహనం కోల్పోయి బండబూతులు తిడుతున్నారు.

అంతలో-

వరండాలో ఒక తలుపు తెరుచుకుంది. తెరచిన తలుపు ముందు గారపళ్ళ బంట్రోతు ప్రత్యక్షమయ్యాడు. అతన్ని చూడగానే వారిలో అశాంతి పతాకస్థాయికి చేరుకుంది అతన్ని పక్కకు నెట్టి ఆఫీసులోనికి ప్రవేశించడానికి-జేబు కత్తిరించుతూ దొరికిపోయిన దొంగ మీదకు విజృంభించిన జనంలా ముందుకురకబోయారు. పరిస్థితి గమనించిన బంట్రోతు వాళ్ళకా అవకాశం ఇవ్వకుండా గబాలున లోన దూరి, తలుపు మూసేసాడు. ఊహించని పరిణామానికి అవాక్కయిపోయారు

కొద్దినిముషాల్లో ఓ గుమాస్తా కిటికీ దగ్గర ప్రత్యక్షమయ్యాడు.

"మాకు పెన్షను ఇస్తారా! లేకపోతే పెన్షను పుస్తకాల్ని మీ ముఖాన్న కొట్టి పొమ్మంటారా?"

పెన్షనర్లంతా ఒక్కసారి అరిచారు

"ఉద్యోగం చేసిన తరుణం ఆఫీసుల్లో అడ్డమైన చాకిరీ చేసినందుకు ప్రతిఫలంగా ముసలి కాలంలో మాకు ప్రభుత్వమిచ్చే డబ్బు నివ్వడానికి మీకింత ఇదా?" గొడ్డులా చాకిరీ చేసి రిటైరైన ఓ వ్యక్తి ఆవేశం.

"మీ బొడ్డులోంచి డబ్బుతీసి ఇసున్నట్లు ఫీలైపోతున్నారు. సొమ్మొకడిది సోకొకడిది". సొమ్మునంతా పేకాటకు తగలబెట్టుకున్న ఓ ముసలి సోగ్గాడు వ్యాఖ్యానించాడు

"తొందరపడకండి ఈ దినం మేం పెన్షను కోసం ఇక్కడ పడిగాపులు పడుతున్నాం రేపో ఎల్లుండో మీరూ ఇక్కడ మాతోపాటూ నిలబడే సమయం వస్తుంది. మనిషికి చావూ, ఉద్యోగస్తుడికి రిటైర్మెంటూ తప్పవుగా" ఓ మాజీ గుమస్తా గొంతు చించుకొని అరిచాడు

"చాలు చాల్లెండి. ఇంకా ఆగండి కష్టాలు మీకే కాదు మాకూ ఉన్నాయి. మీరంతా ఇలా గొడవ చేస్తే మేం పనిచెయ్యలేం. తలుపులు తీస్తే మీద పడుతున్నారు తియ్యకపోతే కేకలు వేస్తున్నారు. మీరిలా అల్లరి చేస్తే రాత్రయినా మీరంతా ఇక్కడిలా ఉండాల్సిందే మీకు ఏ గొడవా లేకుండా పెన్షన్లు ఇస్తామిక. ఆడాళ్ళంతా ఒక దగ్గర మగాళ్ళంతా ఒక దగ్గర ఒకదానిమీద ఒకటి. మీ పెన్షను పుస్తకాలుంచండి. వాటి ప్రకారం వరుసగా పిలుస్తాం" వాళ్ళ గొడవనేమీ పట్టించుకోకుండా అన్నాడు గుమస్తా.

"ఇదేదో ఉదయమే చేస్తే ఎంత బాగుణ్ణు" ఎవరో అరిచారు.

"ఏం చెయ్యమంటారు? కాషియరు ఉదయం సెలవు పెట్టాడు ఈ దినం వాళ్ళ నాన్నగారి తద్దినం అప్పటికే ఒక్కపూటలో తంతునంతా ముగించుకు వచ్చాడు" గుమస్తా చెపుతున్నాడు.

"వాళ్ళనాన్న తద్దినంకాదు కాని, మేము తా పెద్దకర్మకు ఏర్పాట్లు చేసుకోవలసి వస్తుంది కాబోలు" ఎవరిదో స్వగతం.

"బాబూ. ఆడవాళ్ళం మమ్మల్ని ముందు పంపించేయండి"

"ఇంకా ఆడా మగా ఏమిటి? అంతా సమానం కాస్త ఓపిక పట్టండి" గుమస్తా విసుక్కున్నాడు.

"అదికాదు బాబూ. చాలా దూరం నుంచి వచ్చారు మరో గంటలో మా ఊరికి ఆఖరుబస్సు వెళ్ళిపోతుంది రాత్రిపూట ఊరుకాని ఊర్లో ఉండాలంటే కష్టం చేతిలో డబ్బుకూడా లేదు" ఆవిడ బతిమాలుతూ వివరించబోయింది.

"ఈ కథలు చెప్పకండిమరి! రోజుకో వంద కథలు వింటుంటాం ఇంతకీ మీ మెడలో చంద్రహారం, చేతిలో బంగారం గాజులూ

> రిటైరయ్యాక కూడా ఆయన జీవితం మూడు పెగ్గులు, ఆరు పేకలుగా సాగిపోయింది. ఓరోజు రాత్రి, క్లబ్బులో రాత్రి పదకొండువరకు పేకాడివచ్చి పడుకున్న రాఘవరావు ఉదయం అయినప్పటికి చచ్చిపోయివున్నాడు.



చూస్తుంటేనే తెలుస్తుంది మీకు డబ్బుందో లేదో" గుమస్తా కసురుకుంటూ వెళ్ళిపోయాడు.

మొత్తానికి పెన్షను పక్షులు కాస్త శాంతించారు గుమస్తా చెప్పినట్లు పెన్షను పుస్తకాల్ని టేబుల్ మీదనుంచారు వాళ్ళు.

తన పెన్షన్ పుస్తకాన్ని కూడా టేబుల్ మీద వుంచి వచ్చి, ఓ బెంచిమీద నీరసంగా కూలబడింది సుందరమ్మ. సుందరమ్మకు అరవైతొమ్మిదేళ్ళు నిండి ఆరునెలలు కూడా కాలేదు. అయితే ఆమె పెన్షను పుచ్చుకుంటూ మాత్రం సంవత్సరమే కావస్తుంది. డెబ్బైయ్ దాటిన దేశభక్తులంతా మంత్రి పదవులు చేపట్టే ఈ దేశంలో ఆఫీసు ఉద్యోగులుమాత్రం ఏభై ఎనిమిది ఏళ్ళకే ఉద్యోగానికి పనికిరాకుండాపోతున్నందువలన సుందరమ్మ అన్నై ఎనిమిదో ఏటవరకు ఉద్యోగం చేసిందనుకోడానికి వీల్లేదన్నది నిర్వివాదాంశం. నిజానికి ఆవిడ ఉద్యోగమేచేసి ఎరుగదు. ఫేమిలీ పెన్షను పుచ్చుకుంటున్న ఆవిడ భర్త రాఘవరావు ఏదో గవర్నమెంటు ఆఫీసులో ఆఫీసరుగిరీ వెలగబెట్టాడు. ఉద్యోగం చేసినంతకాలం అతడు రెండు చేతులతో సంపాదించాడు. నాలుగు చేతులతో ఖర్చు చేశాడు కూడా. అతని సంపాదనంతా విందులూ వినోదాలకు, పేకాటలో టెనెట్వంటీ స్టేకులకూ, పెగ్గు వేసుకున్నప్పుడు పదిమంది మిత్రుల కంపెనీకీ ఖర్చయిపోయింది. ఆయన ఉద్యోగంలో వున్నప్పుడు సుందరమ్మ కుందనపుబొమ్మలా వుండి, చూపుకు మహాలక్ష్మిలా, దర్పుకు మహారాణిలా వుండేది. రాఘవరావుగారు రిటైరయ్యాక, వేలకు వేలు పోసి యూనివర్సిటీ చదువులు చెప్పించిన కొడుకులు పెళ్ళాలతో ఎగిరిపోయారు. రిటైరయ్యాక వచ్చిన డబ్బు పట్నంలో ఓ సొంత గూడు కట్టుకోడానికి, రెసుగు రాలలా ఎదిగొచ్చిన కూతుళ్ళకు మొగుళ్ళను కొనిపెట్టడానికి సరిపోయింది.

రిటైరయ్యాక కూడా ఆయన జీవితం మూడు పెగ్గులు ఆరు పేకలుగా సాగిపోయింది. ఓ రోజు రాత్రి, క్లబ్బులో రాత్రి పదకొండువరకు పేకాడి వచ్చి పడుకున్న రాఘవరావు ఉదయం అయినప్పటికి ప్రశాంతంగా చచ్చిపోయి వున్నాడు. అప్పట్నుంచి గవర్నమెంటు ఇస్తున్న ఫేమిలీ పెన్షను, భర్త కట్టించిన ఇల్లు సుందరమ్మకు ఆసరా అయ్యాయి.

పెళ్ళి కానంతకాలం పెళ్ళాంగూర్చి కలలుకనే యువకుడు తీరా పెళ్ళయ్యాక ఆవిడ గొంతెమ్మ కోర్కెల లిస్టు విని అదిరిపడినట్లు, ఫస్టుకోసం ఆశతో ఎదురుచూసిన పెన్షనర్లు తీరా ఫస్టువాడు మాత్రం నానా అగచాట్లుపడాల్సి వస్తుంది పెన్షను అందుకోడానికి. ఈ తిప్పలు ఏవీ పడకుండా నెలనెలా ఎవరైనా పంపి పెన్షను తెప్పించుకోవాలంటే ఆవిడ కొడుకులుగానీ, మనుమలుగానీ ఎవరూ ఆ వూరిలో లేరు. పోనీ, ఎవరైనా బతిమాలి తెప్పించుకుందామన్నా, ఆవిడ నిజంగా ఆ దినంవరకు బ్రతుకుందని

ఓ ఆఫీసరు దేవుడు సర్టిఫికేటు ఇవ్వాలి అదే గనుక లేకపోతే నిజంగా ఆవిడ బ్రతికే వున్నా చచ్చినట్లే లెక్క. అలాకాదు బ్యాంకుద్వారా పెన్షన్ తీసుకోవాలి అంటే, సంతకం సరిగా టేలీ కావాలి మీదపడుతున్న ముసలితనం ప్రభావంవలన చేయి ఒణకడం, సంతకం ఒక్కోసారి ఒక్కోలా ఉండడం జరుగుతుంది అందువలన 'ఈ సంతకం మీదికాదు పోండి' అనేస్తారు బ్యాంకువాళ్ళు అందుకే ఈ బాధలేవీ పడలేక, ఏదో కాస్త ఓపిక తెచ్చుకుని ఆవిడే స్వయంగా పెన్షను తెచ్చుకోడానికి బయలుదేరింది.

పెన్షను ఒక్కొక్కరికి పిలిచి ఇస్తున్నారు. సుందరమ్మ వంతుకూడా వచ్చింది. ఆమె వెళ్ళి సంతకంపెట్టి పెన్షను అందుకుంది.

"అమ్మగారూ! మీకు ఈ నెలనుంచి పెన్షను ఇరవై రూపాయలు పెరిగింది. లోన ఆఫీసరు గారున్నారు మిమ్మల్ని పిలుస్తున్నారు. ఓసారి వెళ్ళండి" ఆమె నోట్లు లెక్కపెట్టుకుంటుంటే చెప్పాడు.

డబ్బు లెక్కపెట్టుకున్నాక, ఆఫీసరు గదిలోనికి వెళ్ళింది.

"చూడండమ్మా! మీరు పెనను తీసుకుంటూ సంవత్సరం అవుతుందికదూ?" సిగరెట్ నుసి యాష్ట్రేలో దులుపుతూ అడిగాడు ఆఫీసరు

"అవును బాబూ!" అంది ఆమె. భుజంచుట్టూ చెంగు కప్పుకొంటూ

"చూడండి మామ్మగారూ! మీరేమీ అనుకోక పోతే ఒక విషయం చెప్తాను"

"చెప్పండి బాబూ!"

"రూల్సుప్రకారం మీకు మళ్ళీ పెళ్ళికాలేదని ఓ సర్టిఫికేటు మీరు మాకు సబ్‌మిట్ చెయ్యాలి, ఏడాదికోమాటు..."

"ఏమిటండీ ఆఫీసరుగారూ. మీకేమైనా మతి పోయిందా?" ఆమె గొంతులో ఆశ్చర్యం. కోపం ధ్వనించాయి.

"లేదు, బాగానే వున్నాను. కాని మీరు ఈ సర్టిఫికేట్‌ను ఇద్దరు గవర్నమెంటు ఆఫీసర్ల దగ్గరగాని, ఊర్లో పేరున్న ఇద్దరు ప్రముఖ వ్యక్తులనుంచిగాని తీసుకొని మాకు సబ్‌మిట్ చెయ్యాలి" ఆఫీసరు రూల్ వివరించాడు.

సుందరమ్మ ఆముదం తాగినట్లు ముఖంపెట్టి, వినకూడని మాటలు వింటున్నట్లు చెవులు మూసుకుంది

"రామరామ. నాకు మళ్ళీ పెళ్ళేమిటి? డెబ్బయవపడిలో అడుగుపెడుతున్న ముసలి ముండను చూడండిబాబూ! మీరు నా కొడుకు లాంటివారు, చెబుతున్నా వినండి. ఒకవేళ నాకు పెళ్ళికాగానే, శోభనం జరగకుండానే మా ఆయన చచ్చిపోయినా, నేను మళ్ళీ పెళ్ళిచేసుకొనేదాన్ని కాను"

"అవుననుకోండి. అయితే నేనే చెయ్యగలను చెప్పండి ఇది రూలు. దీన్ని పాటించకపోతే మా ఉద్యోగాలు పోతాయి" ఆఫీసరు తన అసహాయతను తెలియచేశాడు.

"రూలో-రుబ్బురోలో! ఇదెక్కడి చోద్యమయ్యా? డెబ్బయ్యోపడిలో పడిన ముసల్ది ఎక్కడైనా పెళ్ళిచేసుకోడం చూశామా?" ఆవిడ కళ్ళెర్రచేసింది.

"మీరు అన్నారు కాబట్టి చెప్తున్నాను. ఈమధ్యనే ఇంగ్లాండులో ఎనభై ఆరేళ్ళ ముసలమ్మ మరో తొంభై ఏళ్ళ తాతయ్యను పెళ్ళిచేసుకుంది. అలాగే అమెరికాలో ఓ ఎనభై ఏళ్ళ తాతయ్య పదహారేళ్ళ పడుచుపిల్లని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడండీ ఫ్రాన్సులో డెబ్బై అయిదేళ్ళ ముసలమ్మ ఓ పాతికేళ్ళ కుర్రాణ్ణి వరించిందికూడా..."

"ఆపవయ్యా ని బోడి కబుర్లు చూస్తుంటే నువ్వు ఆఫీసరు పనికి కాకుండా ఏదైనా పత్రికలో వింతలు విడ్డూరాలు రాయడానికి పనికొచ్చేలా ఉన్నావు. వాళ్ళంతా దొరలూ, దొరసానులూ. నేనేమైనా నీకు ఇంగ్లీషు దొరసానిలా కనిపిస్తున్నానయ్యా? నేను పదహారణాల తెలుగు స్త్రీనయ్యా. ఆ దొరసానికీ నాకూ పోలుస్తున్నావు వాళ్ళెప్పుడైనా మొగుడికి పాదసేవచేసి ఏడ్చారా? ఓ నోమో వ్రతమో చేసి తగలబడ్డారా? ఈ దేశాన్ని ఆ ఇంగ్లీషువాడు రాజ్యంచేస్తున్న దినాల్లో ప్రవేశపెట్టబడిన ఈ పనికిమాలిన రూల్సు పట్టుకొని వేళ్ళాడుతూ నాలాంటి ముసలిముండల ఉసురుపోసుకుంటున్నారు. ఈ పనికిమాలిన రూలువల్ల నాలాంటి ముసల్దిపడే మనోవేదనకు సానుభూతి చూపడంపోయి, ఎక్కడో ఎవరో దొరసాని ముసలికాలంలో పెళ్ళాడిందని చెప్పి. పంతులు పిలక్కీ, సాయబు గెడ్డానికీ ముడివేస్తున్నావు." సుందరమ్మ ప్రళయకాలరుద్రుని మామ్మలా ఆవేశంతో ఊగిపోతూంది

"చూడమ్మా. ఏమిటీ న్యూసెన్సిక్కడ? ఏదో పెద్దదానివని ఓపికగా నీకు బోధపరుస్తున్నాను గానీ, నీకు ఇలా విడమరచి చెప్పాల్సిన అవసరం నాకు లేదు. మేం అడిగినట్లు నీకు మళ్ళీ పెళ్ళికాలేదని సర్టిఫికేట్‌ను వచ్చేనెల తీసుకురాకపోతే నీకు పెన్షను ఇవ్వడం జరగదు. ఇక వెళ్ళు..." ఆఫీసరు చిరాకు ప్రదర్శించి, కసరికొట్టాడు

"వెళ్తాను వెళ్తాన్లేవయ్యా. లేకపోతే ఇక్కడేమైనా తిష్టవేసి కూర్చుంటాననుకున్నావా? వెధవ కలికాలం. ఛీఛీ. కాకపోతే ఈ ముసలికాలంలో నాకీ ప్రారబ్ధమేంటి? ఆలనాడు సీతాదేవి పాతివ్రత్యాన్ని నిరూపించుకోడానికి అగ్నిప్రవేశం చేయాల్సివచ్చింది ఈరోజు నా ముండమోపితనాన్ని నిరూపించుకోడానికి ఓ ఇద్దరు మహానుభావులు కాగితంముక్కలు రాసివ్వాలి. నాఖర్మ ఇలా తగలడింది..." ఆమె విసవిసా వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిన సుందరమ్మ పెన్షను ఆఫీసుకు మళ్ళీ తిరిగిరాలేదు. ఆమె అవమాన భారంతో క్రుంగిపోయి. ప్రాణాలు వీడిందో తనకు మళ్ళీ పెళ్ళికాలేదని నిరూపించే సర్టిఫికేటుకోసం ఎవరెవరి చుట్టూ తిరుగుతూ ప్రయత్నిస్తూందో.

ఆమె మీకూ కనిపించవచ్చు. కనిపిస్తే కాస్త సాయంచెయ్యండి.

✱

[ఈ కథలోని సుందరమ్మ పాత్రకు స్ఫూర్తి మా మామ్మ. పోస్టల్ పెన్షనర్ అయిన ఆమెకు మళ్ళీ పెళ్ళికాలేదని నేనే సర్టిఫికేట్ సంపాదించవలసి వచ్చింది అయిదేళ్ళ క్రితం మా అందర్నీ వీడి అనంత దూరాలకు తరలిపోయిన ఆమె దివ్య స్మృతికి... -రచయిత.]

తొందర —అశ్విని

